
ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

- పెనమలూరు – చోడవరం రోడ్డులో ఆక్రమణలు
- గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇళ్ల కేటాయింపు
- రహదారి విస్తరించాలని స్థానికుల వినతి


పెనమలూరు - చోడవరం రోడ్డులో చెరువు వద్ద ఉన్న ఆక్రమణలు

పెనమలూరు: పెనమలూరులో ఆక్రమణలు తొలగించటానికి రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. పెనమలూరు – చోడవరం రోడ్డులో హైస్కూల్ సెంటర్ నుంచి అంబేడ్కర్‌కాలనీ వరకు రహదారి పక్కనే ఆక్రమణలు ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం పేదలు రహదారి పక్కన ఆక్రమించి ఇళ్లు ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు 100 కుటుంబాలు ఆక్రమణల్లో ఉన్నారు. రోడ్డు పక్కే గృహాలు ఏర్పాటు చేసుకోని ఆక్రమించటంతో రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పైగా వర్షం చినుకుపడితే ఆక్రమణలకు పక్కనే పేరంటాళ్ల చెరువు ఉండటంతో చెరువులో నీరు నిండి ఇళ్లలోకి చేరి ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆక్రమణలు తొలగించేపనిలో అధికారులు ఉన్నారు.

ఇళ్లు కట్టించిన జగనన్న

కాగా చెరువు పక్కనే రోడ్డు ఆక్రమణల్లో ఇళ్లు కట్టుకుని నివశిస్తున్న వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని జగనన్న పాలనలో పేదలకు మేలు చేశారు. ఆక్రమణల్లో ఉంటున్న పేదలకు గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారు. పెనమలూరు –చోడవరం రహదారి పక్కనే ఉన్న 100 కుటుంబాలకు గ్రామంలో జగనన్న పాలనలో ఇళ్ల పట్టా అందజేశారు. నేడు రహదారి పక్కన ఉన్న వారిని అధికారులు తొలగించినా వారికి జగనన్న కాలనీలో ఇళ్లు ఉండటంతో పేదలు ధైర్యంతో ఉన్నారు. ఆనాడు జగనన్న ఇళ్లు కట్టించి ఇవ్వకపోతే కూటమి పాలనలో రోడ్డు పాలయ్యేవారమని నివాసితులు తెలుపుతున్నారు. జగనన్నకు నివాసితులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్..

కాగా రోడ్డు పక్కనే ఉన్న ఆక్రమణలు తొలగించితే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. పెనమలూరు - చోడవరం రహదారి ఆక్రమణలు కారణంగా వెడల్పు తక్కువగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యగా ఉంది. ఇళ్లల్లో ఉన్న వారు భయటకు రావాలంటే నేరుగా రోడ్డుపైకి రావటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. నివాసితులు ఈ ప్రాంతం నుంచి తరలి వెళ్లటం సురక్షితం. అధికారులు మూడు రోజుల్లో రహదారి పక్కన ఉన్న ఆక్రమణలు తొలగించటానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

రహదారి విస్తరించాలి..

రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించిన తరువాత పెనమలూరు – చోడవరం రహదారి విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రసుత్తం రోడ్డు గుంతలు పడి ఉందని, ప్రయాణించటానికి వీలు లేకుండా ఉందని తెలుపుతున్నారు. గుంతల రోడ్డు మరమ్మతులతో సరిపెట్టకుండా ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరించి నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు నిర్మిస్తేనే ఆక్రమణలు తొలగింపు వలన గ్రామస్తులకు ఉపయోగం చేకూరుతుందని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు.

శివయ్యకు అన్నాభిషేకం


పిన్నమనేని హైట్స్‌లో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పిన్నమనేని హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని శివయ్యకు అన్నాభిషేకం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కందిమళ్ల అంజనీకుమారి, ఆంజనేయులు దంపతుల ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద నిత్య పూజలు, అభిషేకాలు, పంచహారతులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమావాస్య సందర్భంగా శివయ్యను రకరకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం పలు అభిషేకాలతో పాటు అన్నాభిషేకం చేశారు. రాత్రి శివలింగ ఆకారంలో దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద ఉభయ దాతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పేరంటాలమ్మ, రామలింగేశ్వర స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక పర్యవేక్షించారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన


బాలరామకృష్ణమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న మల్లాది విష్ణు

గన్నవరం: స్థానిక శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సమీపంలోని సపోట తోటలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వనసమారాధన ఉత్సాహంగా జరిగింది. తొలుత గోపూజ, కార్తిక దామోదర(ఉసిరిక)పూజతో వనసమారాధనను ప్రారంభించారు. అనంతరం ఆటలు, పాటలు, క్విజ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆగిరిపల్లి వేద విద్యార్థులచే వేద పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం కార్తిక వనభోజనం, చిన్న పిల్లలచే నృత్య ప్రదర్శన, సంగీత విభావరి జరిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు కొప్పరపు వెంకటబాలరామకృష్ణమూర్తి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. బ్రాహ్మణులు అందరూ ఐక్యమత్యంగా ఉండాలని చెప్పారు. వన సమారాధనకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన పరిషత్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు కప్పగంతు లక్ష్మణ్‌శాస్త్రి, కార్యదర్శి గోపరాజు సత్యపవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కోశాధికారి మామిళ్లపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఐఎం ఉత్తమ విద్యార్థినికి ఏటా రామచంద్రమ్మ అవార్డు

గన్నవరం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ) విశాఖపట్నంలో ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ ఎంబీఏ విభాగంలో ప్రతి ఏటా ఉత్తమ మహిళా విద్యార్థినికి అవార్డును ప్రదానం చేయనున్నట్లు వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు వెంకట్ మోటపర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలను విద్యా, వ్యాపార రంగాల్లో ప్రోత్సహించడానికి కళాశాల యాజమాన్య కమిటీ మాజీ అధ్యక్షురాలు మోటపర్తి రామచంద్రమ్మ పేరుతో ఈ అవార్డును అందజేస్తామన్నారు. ఈ అవార్డు నిమిత్తం రూ.5.25 లక్షలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నిధి నుంచి వచ్చే ఆదాయం(వడ్డీ)తో ప్రతి ఏటా ఉత్తమ విద్యార్థినిని ఎంపిక చేసి మెరిట్ సర్టిఫికెట్, నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఈ మేరకు ఐఐఎం డైరెక్టర్‌తో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.

హడావిడిగా యంత్రాలతో వరికోతలు



ఉంగుటూరు: ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో ఉంగుటూరు మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో వచ్చిన తుఫాన్‌తో శనివారం కురిసిన వాన జల్లులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కొందరు కోతలు వాయిదా వేసుకోగా, తప్పని పరిస్థితుల్లో ఉన్న పంటను యంత్రాలతో కోతలు కోస్తున్నారు. మరో పక్క ధాన్యం రాశులను టార్పాలిన్ పట్టాలతో భద్రపరుచుకుంటున్నారు. మండలంలో 26 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా ఖరీఫ్ సాగుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో సీజన్ ఆలస్యంగా మొదలైంది. సాగునీరు పుష్కలంగా అందకపోవడంతో కోతలు ఆలస్యమయ్యాయి. తుఫాన్‌తో రైతులు భయాందోళన చెందుతున్నారు.

గాన చరితుడు ఘంటసాల



విజయవాడ కల్చరల్: గాన చరితుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఆదిలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కొనియాడారు. ఆదిలీల ఫౌండేషన్, తెలుగు కళావాహిని, ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ఘంటసాల 102 జయంతి వేడుకలు, చల్లా సుబ్బారాయుడు రచించిన ఘంటసాల గాన సర్వస్వం గ్రంథావిష్కరణ, ఘంటసాల లఘునాటం కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ తెలుగు వారి గుండె చప్పుడు ఘంటసాల మాస్టారు అని అభివర్ణించారు. ఘంటసాల అభిమాన సంఘం ఛత్తీస్‌గఢ్ అధ్యక్షుడు తనికెళ్ళ పార్థసారథిమాట్లాడుతూ ఘంటసాల పాటల సర్వస్వం రచయిత చల్లాసుబ్బారాయుడు కృషిని అభినందించారు. చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, చింతకాయల చిట్టిబాబు భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. సయ్యద్ రహంతుల్లా ఘంటసాల పాటల అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు.

వక్తృత్వ పోటీలతో నైపుణ్యం పెంపు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో పాల్గొని నైపుణ్యాలు పెంచుకోవాలని వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యాన నవంబర్ నెలలో 'మా గ్రంథాలయం' అనే అంశంపై వీడియో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం జరిగింది. చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ వక్తలుగా ఎదగడానికి పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థి వికాస వాహిని సంస్థ అధ్యక్షుడు వి.కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. పోటీల్లో రెండో తరగతికి చెందిన తనూష ప్రథమ నిలిచింది. గ్రంథాలయ అధికారి కె. రమాదేవి మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న ఇతర ప్రాంతాల విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్ట్స్ సొసైటీ కార్యదర్శి పావులూరి చిదంబేశ్వరరావు, విజయవాడ లయన్స్ క్లబ్ జోనల్ సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్, సిబ్బంది రాంబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ ఏసీపీ దామోదర్

రామవరప్పాడు: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే మీ ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని సెంట్రల్ ఏసీపీ దామోదర్ హెచ్చరించారు. రామవరప్పాడు రింగ్ నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వారికి, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. దామోదర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 30 అంతర్గత రోడ్లు ఉన్నాయన్నారు. అంతర్గత రోడ్ల నుంచి వచ్చే వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రోన్, డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. జాతీయ రహదారికి ఇరు పక్కలా ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని హెచ్చరించారు. తనిఖీలో పడమట సీఐ పవన్ కుమార్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, మాచవరం సీఐ ప్రకాష్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న 31 వ వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంగీతానికి ఎల్లలు లేవని చాటుతూ విఖ్యాత హిందూస్తానీ విద్వాంసుడు సంతోష్‌కుమార్ వయోలిన్‌పై వాగ్గేయకారుల కీర్తనలను పలికించారు. తబలాపై రాజ్‌కుమార్ నహర్ సహకరించారు. సంస్థ సంగీత విద్వాంసులు ఆలపించిన మంగళం కీర్తనలతో సంగీతోత్సవాలు ముగిశాయి.

హైందవ శంఖారావం సన్నాహక బైక్ ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): వచ్చే నెల 5న కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయం వద్ద కేసరపల్లి గ్రౌండ్స్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్లకు సన్నాహకంగా ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్క్యూబ్రిడ్జి వద్ద ప్రారంభమై బాలాజీనగర్, రాణిగారితోట, కృష్ణలంకలోని పలు వీధుల మీదుగా ఫీడర్ రోడ్డులో బస్టాండ్ వరకు కొనసాగింది. దేవాలయాల స్వయంప్రతిపత్తికి జనవరి 5న జరిగే హైందవ శంఖారావంలో హిందువులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హైందవ జాగృతి సమితి అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరెడ్డి, శనగపల్లి మల్లికార్జునరావు, పరిమి గోవర్ధన్, వెంకటకృష్ణ, ముఖేష్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఆదివారం సందడి సందడిగా జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని ఆలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. ఏరా.. ఓరేయ్.. ఎలా ఉన్నావ్.. ఏమి చేస్తున్నావ్ అంటూ చిన్ననాటి స్నేహితులు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బాల్యంలోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పాఠశాలలో చదువుకునేటప్పుడు చేసిన చిలిపి చేష్టలు, చిరు తగాదాలు, ఉపాధ్యాయులకు పెట్టిన మారు పేర్లు, తోటి స్నేహితులపై వేసిన జోకులు గుర్తుచేసుకున్నారు. రోజంతా బాల్యమిత్రులతో హుషారుగా, సంతోషంగా గడిపారు. తమ చిన్ననాటి తరగతి గదులు, బెంచీలు చూసుకుని ఎంతో మురిసిపోయారు. తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన పాఠశాల రుణం తీర్చుకోలేనిదని పూర్వ విద్యార్థులు చెప్పారు. గతేడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అల్యూమినీ తరఫున నగదు బహుమతులను ఉపాధ్యాయుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, పాఠశాల స్థల దాత దోనవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడకల్చరల్: కోసూరి రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని భాషావేత్త డాక్టర్ పాపినేని శివ శంకర్ అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యాన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం కోసూరి రవికుమార్ రచించిన దాపల కవితా సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన శివశంకర్ మాట్లాడుతూ రవికుమార్ నిరంతర అధ్యయన శీలి అన్నారు. ఆయన కవిత్వమంతా సమాజం చుట్టూ తిరుగిందన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రవికుమార్ కాలక్షేపంగా కవితా వ్యవసాయం చేయలేదని అక్షరాల కూర్పుతో రాజనాలు పండించినట్లు తెలిపారు. కవి పుప్పాల శ్రీరాం కవితా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు బండ్లమాధవరావు, సుధారాణి రవికుమార్ సాహిత్య జీవిత విశేషలను వివరించారు. రవికుమార్ మాట్లాడుతూ సుదీర్ఘ విరామం తరువాత కొత్త కవితా సంపుటి తీసుకువచ్చామన్నారు. అనిల్ డ్యానీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముగిసిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో


ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో శ్రీధర్ సీసీఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో- 2024 ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన ప్రదర్శనను 35వేల మంది తిలకించారు. చివరి రోజు ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కుటుంబంతో వచ్చి ప్రదర్శనను తిలకించారు. గుంటూరు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ చక్రవర్తి ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కరెన్సీ నాణేలు, నోట్లలో ఆ దేశ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబిస్తుందన్నారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నాణేలు, కరెన్సీల సేకరణ కేవలం హాబీగా మాత్రమే కాదని, జ్ఞానం పెంపొందించే విద్య అని కొనియాడారు. సీఐడీ డీఎస్పీ కె చక్రవరి మాట్లాడుతూ ఈ సంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. నిర్వాహకులు కలెక్టర్ లక్ష్మీశ, గుంటూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చక్రవర్తిలను ఘనంగా సత్కరించారు. తానా పూర్వ అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా సభ్యులు జిల్లెలుమూడి వెంకట్, తానా మాజీ కార్యదర్శి కొల్లా అశోక్, నిర్వాహకులు కొమ్మూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ


ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడ బ్రాంచి 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బోడేపూడి హనుమయ్య, కార్యదర్శిగా డాక్టర్ వుమ్మినేని సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర వీఎస్ వరప్రసాద్, డాక్టర్ వి పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ పి సుశీల, డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ పరుచూరి అనీల్ కుమార్, డాక్టర్ పి.జయకర్‌బాబు, అకడమిక్ సభ్యుడిగా డాక్టర్ మెహబూబ్ షేక్, సభ్యులుగా డాక్టర్ పీవీ సోనీలాల్, డాక్టర్ కదీర్‌షరీఫ్ మరో 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిని పూర్వ అధ్యక్షుడు చలసాని ప్రమోద్ తదితరులు అభినందించారు.

పోరంకిలో ఉచిత వైద్యశిబిరం



పెనమలూరు: పోరంకి గ్రామంలో ఆదివారం అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ



పెనమలూరు: పోరంకిలో అయ్యప్పస్వామి పడి పూజ, భజన ఘనంగా చేశారు. గ్రామంలో గంగానమ్మతల్లి గుడి వద్ద శనివారం రాత్రి అయ్యప్ప స్వాములు, శివసతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి భజనలు గురుస్వామి బొర్రాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. గ్రామంలో గత 28 సంవత్సరాలుగా అయ్యప్ప భక్తులు మాల ధరించి పడి పూజ నిర్వహిస్తున్నారు. తెన్నేటి సాంబయ్య గురుస్వామి, బొర్రా శివాజీ గురుస్వామి, పవన్‌గురుస్వామికి భక్తులు ఘనంగా సత్కరించారు. శివసతి చారిటబుల్ ట్రస్ట్ తరఫున బండి రుషి కన్నేస్వామికి రూ.6 వేలు శబరిమల యాత్ర ఖర్చులకు అందజేశారు. అయ్యప్పలు రాత్రి పొద్దుపోయేవరకు భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అభివృద్ధికి ఆమడ దూరం


ఆక్రమణల చెరలో పాఠశాల స్థలం

- 70 ఏళ్ల క్రితం ప్రారంభించిన ముస్తాబాద జెడ్పీ హైస్కూల్
- ఆక్రమణదారుల పాగా
- చర్యలు తీసుకోవాలని వినతి


పాఠశాల తూర్పు వైపు ముఖ ద్వారం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ పాఠశాలను అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. 1949లో ముస్తాబాదలో హైస్కూల్ నిర్మాణం కోసం ఆనాటి పెద్దలు ఆలోచన చేశారు. వారి ఆలోచనలకు అనుగుణంగా 15-07-1949లో బోర్డును ఎస్టాబ్లిష్ చేశారు. కృష్ణాజిల్లా బోర్డు ప్రెసిడెంట్ కాకాని వెంకటరత్నం 29-04-1950లో హైస్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో మేజర్ పంచాయతీగా ఉన్న ముస్తాబాదలో హైస్కూల్ నెలకొల్పటంతో ముస్తాబాద, సూరంపల్లి, సావరగూడెం, మాదలవారిగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపు గూడెం గ్రామాలకు చెందిన ఆనాటి విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకున్నారు. ఉన్నత స్థానాలకు ఎదిగారు. ప్రస్తుతం హైస్కూళ్ల సంఖ్య పెరిగినా ఇప్పటికీ 324 మంది విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి వరకూ ఈ పాఠశాలలో చదువుతున్నారు. 17 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. నలుగురు నాన్‌టీచింగ్ స్టాఫ్ సేవలందిస్తున్నారు.

గొర్రెలు, పందుల పెంపకం

1949లో 8.53 ఎకరాలు విస్తీర్ణంలో ఈ పాఠశాల ఏర్పాటైంది. కాలక్రమంలో పక్కనే ఉన్న పెద చెరువులో హైస్కూల్‌కు చెందిన ఎకరాల మేర భూమి కలిసిపోయింది. దీంతో పాఠశాల చుట్టూ నీరు చేరుకుని ప్రమాదకరంగా ఉంది. రెండు వైపులా నీరు, తూర్పు వైపు ఆక్రమణలు, దక్షిణం వైపు గన్నవరం–ముస్తాబాద రోడ్డు సరిహద్దులుగా ఉన్నాయి. అయితే చెరువు నీరు పట్టిన హైస్కూల్ స్థలాన్ని గతంలోనే గుర్తించి సరిహద్దు రాళ్ల నిర్మాణం చేశారు. ఆ తరువాత మెరక తోలించి, స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించకుండా వదిలివేయడంతో ఒక వైపు నీరు, మరోవైపు ఆక్రమణలతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని పాఠశాల స్థలాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రతి సంవత్సరం అనేక కార్యక్రమాలు ఈ పాఠశాలలో నిర్వహిస్తుంటారు. పాఠశాల స్థలం గుర్తించి దాని చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. పాఠశాల తరగతి గదులు కేవలం 629.69 స్క్వేర్ మీటర్‌లలో నిర్మాణమై ఉన్నాయి. మిగిలిన ప్రాంతం అంతా పాఠశాల పరిధిలోకి తీసుకురావాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

హైస్కూల్ స్థలం అభివృద్ధి చేయాలి



ఎంతో చరిత్ర కలిగిన ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ స్థలాన్ని గుర్తించి మెరక చేయాలి. ప్రహరీ నిర్మించాలి. ప్రభుత్వం చొరవ తీసుకోని చర్యలు తీసుకుంటే పూర్వ విద్యార్థులు సైతం భాగస్వామ్యమవుతాం.

–కందిమళ్ల శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థి, సూరంపల్లి